# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఏలేరు కాలువను ఆధునీకరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ❖ రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర బృందం ఈ రోజు పర్యటించింది.
- ❖ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తామని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు.
- ❖ రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలుల ప్రభావంతో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

ఏలేరు కాలువను ఆధునీకరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కాకినాడ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఈ రోజు పర్యటించారు. అనంతరం కిర్లంపూడి మండలం రాజుపాలెంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, ఏలేరు రిజర్వాయర్‌కు ఒకేసారి 47 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందన్నారు. అదే విధంగా వరదల వల్ల కాకినాడ జిల్లాలో 65 వేల ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కాగా, నష్టపోయిన పంట పొలాలకు హెక్టారుకు 25 వేల రూపాయల నష్ట పరిహారం ఇస్తామని, వరదల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి కొత్త ఇళ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ఈ రోజూ కేంద్ర బృందం పర్యటించింది. ఇందులో భాగంగా విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధికారులతో కేంద్ర బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న వరద సహాయక చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి అధికారులు వివరించారు. వరద సహాయక చర్యల్లో భాగంగా బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, వంటివి పంపిణీ చేశామని వెల్లడించారు. వైద్య

శిబిరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అదే విధంగా వేలాది మంది ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ఇదిలా ఉండగా, బాపట్ల, గుంటూరు ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించింది.

=====================

కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోని పలు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాయని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. కేంద్ర పభుత్వ ప్రసాద్ పథకం కింద దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయంలో కుటుంబ సమేతంగా ఈరోజు కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, గుడిమల్లం ఆలయాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

=====================

సంత్రాగచిలో ఈరోజు మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు బయలుదేరాల్సిన సంత్రాగచి - సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్ ప్రెస్ 11 గంటలు ఆలస్యంగా ఈరోజు రాత్రి 11 గంటల 20 నిమిషాలకు సంత్రాగచిలో బయలుదేరుతుందని వాల్తేర్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కే.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. మరోవైపు తిరుపతి శ్రీకాకుళం రోడ్ మధ్య నడిచే ప్రత్యేక రైలును నిర్వహణ పరమైన కారణాలతో అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు రద్దు చేస్తున్నామని ఆయన తెలిపారు.

=====================

బాపట్ల జిల్లాలో వరద ప్రభావిత కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని లంకా గ్రామాలు, తీర గ్రామాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారని జిల్లా అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంబగా పంట నష్టం, దెబ్బతిన్న గృహాలు, రహదారులు వంటి వాటిని ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అనంతరం వరద బాధితులతో మాట్లాడతారని అధికారులు తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులలో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం, ఒకటి లేకా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారిణి తెలియచేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

=====================

జిల్లాలో రహదారుల పునరుద్దరణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ నుండి రహదారులు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం శాఖల అధికారులతో కలెక్టర్ దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న రహదారులు, తాగునీటి వనరులు, విద్యుత్తు సదుపాయాల పునరుద్ధరణపైన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ సర్పంచులు, సచివాలయం సిబ్బందితో సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

విరామం

======================

కృష్ణా జిల్లాలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల ప్రత్యేక బృందం ఈరోజు కృష్ణా జిల్లాలో పామర్రు నియోజకవర్గంలో తోట్ల వల్లూరు మండలంలోని రొయ్యూరులో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వరద నష్టం పరిశీలించింది. కలెక్టర్ డీకే బాలాజీ నియోజకవర్గంలో వరద నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కేంద్ర బృందాన్ని కలిసి వరద నష్టం వివరించి, సంబంధిత ఛాయాచిత్రాలు కేంద్ర బృందానికి చూపించి రైతులను ఆదుకోవాలని కోరారు.

======================

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను అడుకోవడానికి బ్యాంకుల సహకారం అవసరం అని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈరోజు కలెక్టరేట్ లో జిల్లా స్థాయి బ్యాంకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉంటుందన్నారు. అల్పపీడనం వల్ల జిల్లాలో పాక్షికంగా రోడ్లు, భవనాలు, కాలువలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల నష్టాలపై శాఖల వారిగా వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

======================

"వన్ దన్ వికాస్ కేంద్రాల" ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. "వన్ దన్ వికాస్ కేంద్రాల" (వి.డి.వి.కె) ద్వారా మార్కెట్ లో డిమాండ్ ఉన్న వస్తువులను తక్కువ ఉత్పత్తి వ్యయంతో తయారు చేయాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు కావలసిన వస్తువులను "వన్ దన్ వికాస్ కేంద్రాలు" (వి.డి.వి.కె), స్వయం సహాయక సంఘాల ద్వారా సరఫరా చేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

======================

శ్రీకాకుళం జిల్లాలోని కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జాతర నిర్వహణ కోసం కోటి రూపాయలు మంజూరు చేశామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది కొత్తమ్మతల్లి ఉత్సవాలు అక్టోబరు 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ నుంచి యాత్రికులు వస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

======================

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి రోడ్డు ప్రమాదంలో రోజువారి కూలీలు ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బాధిత కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. దేవరపల్లి మండలం, చిలకావారిపాకలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి దుర్గేష్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి మంచి వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

======================

విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవడానికి అప్రెంటిస్ షిప్ ఎంతో దోహదం చేస్తుందని ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటిఐ ప్రిన్సిపాల్ ఎం.వి.నాగేశ్వరరావు అన్నారు. బాలుర ఐటిఐలో ఈ రోజు "ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీఎం నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా ద్వారా

ఐటిఐ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెంటనే అప్రెంటీస్ షిప్ లభిస్తుందన్నారు. ఈ అప్రెంటీస్ షిప్ మేళాలో రాష్ట్రంలో ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

=====================

తిరుమలలో ఈ రోజు వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న తిరుమలలో స్వామిని 62 వేల 380 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం 3.95 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు వెల్లడించారు.

=====================

ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు వచ్చి గోదావరిలో చేరుతుండటంతో దిగువన ఉన్న పోలవరం ప్రాజెక్టు నుంచి 13 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. అదే విధంగా ముంపుకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, భద్రాచలం దిగువన ఉన్న రహదారుల పైకి వరద నీరు చేరుతుండంతో విలీన మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు భద్రాచలం దగ్గర వరద ప్రవాహం ఉధృతంగా సాగుతుండడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశామని అధికారులు తెలిపారు.

=====================
=====================